# అమావాస్య వెలిగింది



దసరా వెళ్ళి వెళ్ళగానే దీపావళి సందడి ప్రారంభమయింది. ఓపక్క పోలయ్య తూటాలు కట్టిస్తున్నాడని తెలియగానే, ఇంకోపక్క రామయ్య హడావుడిగా పట్నం నించి మనిషిని పిలిపించి తూటాలు కట్టించటం ప్రారంభించాడు.

పోలయ్యకి రామయ్యకి చుక్కెదురు.

ఆ ఇంటిమీది కాకి ఈ ఇంటిమీద వాలడం దేవుడెరుగు పోలయ్య స్నానం చేసిన రేవులో రామయ్య స్నానం చేయడు. ఓసారి పోలయ్య ఇంట్లో పొట్లకాయలు కొన్నారు. అదేరోజు రామయ్య ఇంట్లోనూ పొట్లకాయలు కొన్నారని తెలిసింది. అంతే! పోలయ్య ఇంట్లో ఉన్న పొట్లకాయలు తెప్పించి ముక్కలు ముక్కలు చేసి గొడ్లకు పెట్టించాడు. "వాడూ నేనూ ఒకే కూర తింటామా ఛీ" అనుకున్నాడు పోలయ్య. అంత కసి!

అసలు పోలయ్యకి రామయ్యకి తగాదా పెట్టింది మంగలి కిష్టయ్య. ఓ రోజు రామయ్యకి గడ్డం గీస్తుంటే రామయ్యన్నాడు "ఒరే నా మీసంలాంటి మీసం ఈ వూళ్లో ఎవరికైనా ఉందిరా?" అప్పుడు కిష్టయ్య "అబ్బే! లేదండి" ఈ మీసం ఠీవి ఈ పరగణాలో లేదండి. కానండి, ఆ పోలయ్యగారు మాత్రం మీది పిల్లిమీసమన్నారండి" అన్నాడు. దాంతో రామయ్య కళ్ళురిమాడు. తాతల

తగాదాలు తలపుకు తెచ్చుకుని పళ్ళు నూరాడు.

ఆ తర్వాత కొన్ని రోజులకి కిష్టయ్య పోలయ్యకి గడ్డం గీస్తూ 'అయ్యా! తమది ప్రభువుల మీసఁవండి! రాజాలకి కూడా ఇంతగొప్ప మీసం ఉండదండి. కాని ఆ రామయ్యగారు మీది రొయ్యమీసం అనటం నాకు శానా బాధగా ఉందండి' అన్నాడు.

పోలయ్య పులై పోయాడు. రామయ్యగాడి నెత్తురు తాగుతానన్నాడు. వూరు రెండు పాయలై పోయింది. రెండు ముఠాలు జబ్బలు చరిచారు. కర్రలు చేపట్టి సాముగరిడీలు చేశారు. అటుగాలి ఇటు సోకడానికి భయపడిపోతోంది. "పోలయ్యగాడికి చేసిన కత్తితోనే నాకూ గడ్డం గీస్తావురా" అని రామయ్య కిష్టయ్యని లాగి తన్నాడు. ఆ రాత్రే పోలయ్య మనుషులు కిష్టయ్య గుడిసెకి నిప్పంటించారు. కిష్టయ్య పాలోమంటూ నెత్తిన గుడ్డేసుకు వూరు విడిచి పోయాడు. పట్నంనించి పోలయ్య, రామయ్య చెరో మంగల్ని తెచ్చుకున్నారు.

కిష్టయ్య పోయినా కష్టాలు పోలేదు. తగూ తీరలేదు. అందరూ దీపావళి రాత్రి బలాబలాలు తేల్చుకోటానికి తయారవుతున్నారు. ఊళ్ళో వున్న జిల్లేడు మొక్కలు, కందిమోళ్ళు తగలేసి బూడిద చేశారు. సూరేకారం, గంధకం కలిపారు. తూటాలు దట్టించి గోగునారతో బిగించారు. బుట్టలకి బుట్టలు తయారవుతున్నాయి తూటాలు.

దీపావళి సంజెవేళ.

అందరిళ్ళ ముందు దీపాలు. మిలమిల లాడుతున్న దీపాల వెలుగులో పకపక నవ్వుతూ పువ్వొత్తులు కాలుస్తున్న పాపలు. గల గల నవ్వుతున్న పాపల్ని సర్దుతూ, అదిలిస్తూ దగ్గరుండి మతాబులు కాల్పిస్తున్నాడు రామయ్య కొడుకు సాంబయ్య. మతాబుల వెలుగులో పోలయ్య కూతురు రాధ కళ్ళు తళుక్కుమనటం చూస్తున్నాడు. సాంబయ్య చిచ్చుబుడ్డి వెలుగులో సాంబయ్యని చూసి రాధ 'ఎంతఅందగాడో' అనుకుంది. పట్టుచీర పెళపెళ లాడుతుంటే చెంగు నడుంచుట్టూ తిప్పుకొని దీపాలు సరిచేస్తున్న రాధని చూసి 'చిదిమి దీపం పెట్టుకోవచ్చు' అనుకున్నాడు సాంబయ్య. అటువాళ్ళు ఇటువాళ్ళు ఇది

గమనించినా 'ఈడూ జోడైనవాళ్ళు తప్పేమి' అని ఊరుకున్నారు.

రాత్రి తొమ్మిది గంటలవేళ. వూరు సద్దుమణిగాక కోట దిబ్బకి అటుప్రక్క పోలయ్యజట్టు ఇటుపక్క రామయ్య ముఠా చేరారు. తూటాల బుట్టలు నడుములకి కట్టుకున్నారు. పోరు ప్రారంభమైంది. తూటాలు ఒకరి మీద ఒకరు విసురుకుంటున్నారు. గాలంతా రవ్వలమయం. రయ్యిమని ఎగిరివస్తున్న తూటాల్ని మధ్యలోనే అందుకొని తిప్పి ఎదుటివారి మీదికి విసురుతున్నారు. వొళ్ళు కాలిపోతున్నా లెక్కలేదు. కాలుతున్నకొద్దీ పౌరుషం పెరిగిపోతోంది. ఖాళీ అవుతున్న బుట్టల్లో మనుషులు తూటాలు నింపుతున్నారు. రణకేకలు! వీరావేశం! ఆకాశమంతా నిప్పులు. వూళ్ళో జనం భయపడి ఇళ్ళలో దాక్కున్నారు. ఒళ్ళు కాలిపోయిన అటు పదిమందిని, ఇటు పదిమందిని ఆచార్లు దగ్గరికి మోసుకెళ్ళారు.

ఇంట్లో కూర్చుని ఉండలేని కుటుంబాలు రెండే రెండు. పోలయ్య ఆడవాళ్ళు రామయ్య ఆడవాళ్ళు వరండాల్లో కూర్చున్నారు. బిక్కు బిక్కుమని భయం భయంగా చూస్తున్నారు. సాంబయ్య రాధని చూశాడు. రాధ సాంబయ్యని చూసింది. ఉన్నట్టుండి అటు ముసలమ్మలూ ఇటు ముసలమ్మలూ కలిసి గుసగుసలాడారు. ఆడాళ్లు గల గలా నవ్వారు.

కోట దిబ్బమీద ఇరుపక్షాలకీ తూటాలయిపోయినాయి. ఇక కర్రలు తీసుకు తలపడ్డారు. సాము గరిడీలతో పెతేలు పెతేలుమని మోగుతున్నాయి కర్రలు. చావుదెబ్బలు తగిలిన జనం గొల్లుమని ఏడుపు. ఆ ఏడుపులు, ఆ కేకలమధ్య ఉన్నట్టుండి 'ఆగండి' అని పది ఆడగొంతులు విన్పించాయి. అందరూ కర్రలు దించారు. వాళ్ళు రామయ్య పోలయ్య కుటుంబాలు, ఆశ్చర్చంగా చూశారంతా. ఆడవాళ్ళ మధ్య సాంబయ్య, రాధ చేయి చేయి పట్టుకుని ఉన్నారు.

రామయ్య,పోలయ్య ఒకర్నొకరు చూసుకున్నారు. ఎదురుగా కన్నబిడ్డలు! కోపం కరిగిపోయింది. రామయ్యన్నాడు. "పోలయ్యా! నీ మీసం గొప్పదేనయ్యా!" పోలయ్యన్నాడు "నీ మీసం అంతకంటె గొప్పదయ్యా."

ఎవరో చిచ్చుబుడ్లు వెలిగిస్తే కోట దిబ్బంతా మెరిసిపోయింది.*